# ధూర్జటి భక్తితత్త్వం

**డా. హెచ్. కిషన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, బద్రుక కళాశాల, కాచిగూడ, హైదరాబాద్.**

**ప్రారంభం :** ఆంధ్రసాహిత్య చరిత్రలో శ్రీకృష్ణ దేవరాయల కాలం స్వర్ణయుగం. సాహిత్య సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయల సాహితీ భవనం, భువనవిజయం కవిదిగ్గజాలతో కళకళలాడింది. భువన విజయాన్ని అలంకరించిన అష్టదిగ్గజాలలో నొకడు ధూర్జటి. ఇతడు శివభక్తుడు, శివకవి, శైవమతాభినివేశమున్నా వీరశైవుడుగా మాత్రం కనిపించడు. ధూర్జటి తన కావ్యాలను రాజులకు అంకితమీయకుండా శివార్పణ గావించిన భక్తుడు. సంసారిక జీవితమందు జీవికి సుఖం లేదని అది మోక్ష సాధనకు ప్రతిబంధకమని జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండిపోయారు.

ధూర్జటి రచనలుగా ప్రసిద్ధికెక్కినవి, మనకు దొరుకుచున్నవి రెండే రెండు ప్రధాన గ్రంథాలు. శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యం మరియు శ్రీకాళహస్తీశ్వర శతకం. వీటిలో శతకం విశేషం. సంసారిక జీవితం మీద విరక్తితో కూడిన భక్తితత్త్వం ఈ శతకంలో అచ్చుటచ్చుట కనిపిస్తుంది. అలాగే దక్షిణకాశిగా పేరొందిన శ్రీకాళహస్తి స్థలమాహాత్మ్యాన్ని ప్రస్తుతించిన ప్రబంధం శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం. ఇందులో అనేకమంది శివభక్తుల కథలు వర్ణించబడ్డాయి. ధూర్జటి మరొక కృతి శ్రీకాళహస్తీశ్వరశతకము 'శ్రీకాళహస్తీశ్వరా' అనే మకుటంతో నున్న ఈ శతకం శతక సాహిత్యంలో మకుటాయమానం. భక్తి శతకాల్లో తలమానికం.

ధూర్జటి కవిత్వం ''అతులితమాధురీ మహితమైందని'' ఆంధ్రభోజుడే మెచ్చుకున్నాడు. ఇవి చక్కని అక్షర రమ్యతతో కూడి అలంకారికమైన రచనలో తీర్చిదిద్దిన ప్రతిఘట్టం, ప్రతివర్ణనమై మనోహరమై భాసిల్లాయి. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యంలో, శ్రీకాళహస్తీశ్వర శతకంలో ప్రతిపద్యాన్ని రమణీయంగా తీర్చిదిద్దాడు. అందుకే కాబోలు ఆంధ్రభోజుడు 'స్తుతిమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల అతులిత మాధురీమహిమ' అని ప్రశంసించాడు.

శివభక్తాగ్రేసరుడైన ధూర్జటి భక్తి పారవశ్యంతో ఈ సంసార ఝుంఝూటం నుండి తనను రక్షించమని శ్రీకాళహస్తీశ్వరుడిని ప్రార్థించాడు. నిర్మలమైన భక్తుడు మనసా, వాచా, కర్మణా భగవంతుడిని సేవించడమే భక్తి ఆకలిగొన్న లేగదూడ, అంబా అంబా అని ఆవు పాలకై ఆరాటపడునట్లుగానే, భక్తుని అంతరాత్మ భగవంతుని దర్శనం కోసం ఆరాటపడుతుంది. అలాంటి భగవంతుని వల్ల క్షణమైన చిత్తపరిపాకమే భక్తి.

**భక్తిరకాలు** : భక్తిలో భేదాలున్నట్లే భక్తుల్లో కూడా రకరకాల భక్తులున్నారు. భగవద్గీత నాలుగు విధాలైన భక్తులను పేర్కొంటున్నది.

**చతుర్విధాలు** : **'చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినో అర్జున**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞాని చ భరతర్షభ'**

ఆర్తి, జిజ్ఞాసువు, ఆర్థార్థి, జ్ఞాని అని నాలుగు విధాలైన భక్తులుంటారని అందులో ఆత్మజ్ఞానం గల జ్ఞానీ అయిన భక్తుడే భగవంతునకు అత్యంత ప్రీతిపాత్రుడని శ్రీకృష్ణపరమాత్మ అర్జుననితో చెప్పినట్లు భగవద్గీతలోని పై శ్లోకం వలన తెలుస్తుంది.

**నవ విధాలు** : భాగవతంలో నవవిధ భక్తి మార్గాలను మనం స్వీకరించవచ్చు.

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనమ్**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్**

విష్ణు భగవానుని నామ, రూప, గుణ, ప్రభావాదులను గురించి - శ్రవణం, కీర్తనం, విష్ణోస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అనేవి తొమ్మిది విధాలైన భక్తి స్వరూపం.

పైన చెప్పిన నవ విధ భక్తులలో ఏ ఒక్క దానిని ఉత్తమ పద్ధతిలో అనుష్ఠించినా మానవునకు పరమపద ప్రాప్తి కలుగుతుంది.

**మోక్ష మార్గాలు** : ''మానవ జీవితానికి పరమావధి మోక్షమని వేదాలు, పురాణాలు, భారత, రామాయణాది కావ్యాలు ముక్తకంఠంతో పలుకుతున్నాయి. పునర్జన్మరహితమైనటువంటి మోక్షాన్ని పొందటానికి కర్మమార్గం, జ్ఞాన మార్గం, యోగమార్గం, భక్తిమార్గం అని నాలుగు మార్గాలను మన పెద్దలు నిర్దేశించారు. అందులో సర్వజన సామాన్యమైనది. అందరూ ఆచరించేందుకు వీలైనది, భగవత్ కృపను పొందేందుకు సులభమైనదీ భక్తిమార్గం. భాగవతం ప్రతిపాదించిన తొమ్మిది విధాలైన మార్గాల ద్వారా ఎంతోమంది భక్తులు భగవత్సన్నిధి పొందినట్లు భాగవతం చెప్పుచున్నది. మధురభక్తి ద్వారా గోపికలు శ్రీకృష్ణపరమాత్మను దర్శించగలిగారు. ఇదంతా భక్తి వైభవానికి సంబంధించిన విషయం.

**కొడుకుల్ పుట్టరటంచు నేడ్తు రవివే కుల్ జీవనభ్రాంతులై**
**కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రునకనేకుల్, వారిచే నేగతుల్**
**వడసెన్? పుత్రులులేని యా శకునకున్ వాటిల్లెనే దుర్గతుల్**
**చెడునే మోక్షపదం బపుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా!**

ఈశ్వరా! లోకంలోని జనులెంత అవివేకులు! కొడుకులు పుట్టలేదనియు, తమకు ఉత్తమగతులు లేవనియు అజ్ఞానంచే ఏడ్చుచుందురు. కౌరవ చక్రవర్తియైన దృతరాష్ట్రునకు వందమంది కొడుకులు పుట్టిరి గదా! వారివల్ల అతడెంత ఉత్తమగతికి పోయినాడు. బ్రహ్మచారిగా నుండి అపుత్రకుడైన శుక మహర్షికి ఏ దుర్గతులు కలిగినవి? ఇదంతయు బ్రాంతి తప్ప మరొకటి కాదు. అపుత్రకుడైన వానికి మోక్షమార్గం మూసికొని పోవునా వట్టిది ''జ్ఞానేనహి నృణాం మోక్షః'' అని పై పద్యంలో మోక్షమార్గాన్ని గురించి తెలియపర్చారు ధూర్జటి.

**ఆర్తభక్తి :** ఇక ధూర్జటి భక్తి తత్త్వాన్ని పరిశీలించవలసివస్తే శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఈ కవి తనను రక్షించమని పరిపరివిధాల శివుని ప్రార్థించడం కనపిస్తుంది. ఈ ప్రార్థనలో జీవుడు పడే ఆర్తిని ధూర్జటి భగవంతునికి నివేదించడమే ప్రధానాంశం. తనకు సంసార ఝంఝూటం నుండి ముక్తి కలిగించి రక్షించమని ప్రాధేయపడడం, దానికై భక్తుడు ఆరాట పడడమే ఆర్తభక్తి లక్షణమని ఈ శతకంలో చాలాచోట్ల ధూర్జటి ఆర్తభక్తుడుగా మనకు దర్శనమిస్తాడు.

**ఆలున్ బిడ్డలు తల్లిదండ్రులు ధనబంధున్మహాబంధనం**
**బేలా నామెడగట్టినాడవిక నిన్నే వేళ జింతంతు, ని**
**ర్మూలంబైన మనంబులోనెగడు దుర్మోహాబ్ధిలో గ్రుంకి యీ**
**శిలామాలపు జింతనెట్లుడిపెదో శ్రీకాళహస్తీశ్వరా !**

ధూర్జటి బ్రహ్మచారి అయినా, ఈ ప్రపంచంలో జీవులంతా సంసార ఝంఝూటంలో చిక్కుకున్న వాళ్ళు, వారి నా చిక్కుల్లోంచి తప్పించి భగవంతుని సేవించే భాగ్యం కలుగజేయమని శివుని ప్రార్థిస్తున్నాడు కవి. ఈ ప్రార్థనలో జీవుని ఆర్ధ్రత వ్యక్తమౌతుంది.

**శ్రవణభక్తి** : **నిప్పై పాతక దూలశైలమడచున్ నీ నామమున్మానవుల్**
**దాపున్ దవ్వుల విన్నంక భుజౌదరోద్భూతక్లేశముల్**
**తప్పందీరును ముక్తులౌదురని శాస్త్రంబుల్మహాపండితుల్**
**చెప్పంగా దమకింక శంకలుండవలెనా శ్రీకాళహస్తీశ్వరా**

భగవంతుని పేరు భక్తిశ్రద్ధలతో విన్నంత మాత్రాన్నే పటాపంచలైపోతాయని పెద్దలంటారు. భగవంతుని పేరు గుణగణాలు భక్తిశ్రద్ధలతో వినడమే శ్రవణభక్తిగా భాగవతం ప్రతిపాదిస్తున్నది. పై పద్యంలో శివుని పేరు విన్నంత మాత్రాన్నే అది అగ్ని దూదిని కాల్చినట్లు పాపాలను భస్మీపటలం

చేస్తుందని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. పండితులు చెబుతున్నారు అని ధూర్జటి అనడంలో అతని భక్తితత్త్వంలో గల శ్రవణభక్తి తత్పరత వ్యక్తమౌతుంది.

**భగవద్భక్తి :** **నిను సేవింపగ నాపదల్పొడమనీ, నిత్యోత్సవంబబ్బనీ**
**జనమాత్రుండననీ మహాత్ముడననీ సంసారమోహంబుపై**
**కొననీజ్ఞానముగల్గనీ గ్రహగతుల్కుం దింపనీ, మేలువ**
**చ్చిన రానీయవి నాకు భూషణములే శ్రీకాళహస్తీశ్వరా!**

భగవంతుడు భక్తుని మానసిక పరిపక్వాన్ని పక్షిని, అటువంటి సందర్భల్లో కష్టాలు, నష్టాలు మేలు, కీడు జరుగుతుంటాయని, భక్తుడిటువంటి వాటినన్నిటిని తట్టుకొని నిలిస్తేనేగాని మోక్షప్రాప్తి జరుగదని పెద్దలంటారు. అంటే భగవద్భక్తి సుఖదుఃఖాలకు అతీతమైందనే భక్తితత్త్వం పై పద్యంలో కనిపిస్తుంది.

**భక్తికి ఏవి ప్రధానము : ఏ వేదంబు పఠించెలూత, భజగంబే శాస్త్రముల్పూచె దా**
**నేవిద్యాభ్యసనం బొనర్చెగరి, చెంచేమంత్రమూహించెబో**
**ధావిర్భావని దానముల్ చదువులయ్యా, కావు మీపాదసం**
**సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా !**

జీవికి భగవంతుని సేవాసక్తియే ప్రధానం గాని, శాస్త్రపఠనములు, మంత్రపఠనములు ముఖ్యం గావని సాలెపురుగు, ఏనుగు, పాము, తిన్నడు ఏమి చదివిమోక్షాన్ని పొందారు? శివుని సేవించే గదా అని పై పద్యంలో చెప్పడాన్ని బట్టి ధూర్జటి భగవద్భక్తి సర్వజన సామాన్యమేగాక, సర్వజీవి సామాన్యం చేసినాడు. భగవంతుని చేరేందుకు భక్తి ఎంత సులభసాధనమో కూడ పై పద్యంలో నిరూపించినాడు.

**ఆత్మానుసంధానము :** ''భక్తి తత్త్వంలో ఆత్మానుసంధానం, స్వరూపానుసంధానకు పరాకాష్ఠతను భజించేటటు వంటివి. ప్రకృతిలోని ఏ వస్తువులోనైనా భగవంతుని దర్శించగలగడమే ఆత్మానుసంధాన స్వరూపం. అర్జునుడు శ్రీకృష్ణుని మోకాలినే శివలింగంగా భావించి పూజించెను. ఒక శివభక్తుడు స్త్రీ స్తనమునే శివలింగంగా భావించి సేవించెను. మరొక భక్తుడు ధాన్యం కొలిచే కుంచమునే శివలింగంగా భావించి పూజించెను. ఒక గొల్లవాడు మేక పెంటికనే శివలింగంగా భావించి పూజించెను. ధూర్జటి ప్రస్తావించిన ఈ పురాణగాధల్లో ఆత్మానుసంధానత భక్తి పరతత్త్వం తెలుస్తున్నాయి.

**సామాజిక భక్తి :** భక్తి తత్త్వంలో సామాజిక భక్తి కూడా నేడొక ప్రతిష్ఠమైన స్థానాన్ని ఆక్రమించి ఉంది. సకల జీవులందు పరమాత్మను సందర్శించడమే సామాజిక భక్తి.''మానవ సేవయే మాధవ సేవ'' అనే సూక్తిలోని పరమార్థం కూడా సామాజిక భక్తియే. ఇటువంటి సామాజిక భక్తి 'ఓం శివా!' నిన్ను నమ్మి ఆరాధించే సర్వజనులను రక్షింపమని విన్నవించే ధూర్జటి ప్రార్థనలో కనిపిస్తుంది. ఈ విధంగా శ్రీకాళహస్తీశ్వర శతకంలో ధూర్జటి తన భక్తి తత్త్వాన్ని పలురీతుల్లో స్పష్టపరిచి ఉన్నాడు.

**ఉపసంహారం :** భక్తి అందరికి సులభంగా చరించ వలసిన ఒక సాధనం. దీనిపై ప్రతి మనిషికి అధికారం ఉంది. ఈ ఆధునిక కాలంలో భక్తితో సమానమైన ఆత్మోద్ధారకమగు సులభమైన ఉపాయం మరొకటి లేదు. జ్ఞానం, యోగం, తపం, యాగం వంటివి ఈ కాలంలో దొరకటం సాధ్యం కాదు. పైగా ఈ రోజుల్లో వాటికి ఉపయోగపడే సాధన సామాగ్రి లభించడం కూడా కష్టంతో కూడుకున్నది. కాబట్టి మనుషులు నడుం బిగించి గట్టిగా ఈశ్వరుని యందు భక్తిని ఉంచి సాధన చేయడానికి సిద్ధం కావాలి. అంతేగాక లోకంలో ధర్మంగా ఉండే వాళ్ళలో చాలామంది భగవంతుని యందు భక్తినే ఇష్టపడతారు.

మహర్షి ఈ విధంగా అంటాడు. ''సాపరానురక్తిరీశ్వరే'' పరమేశ్వరుని యెడల పరమానురాగం అనగా పరమ ప్రేమయే భక్తి''. దేవర్షి నారదుడు కూడా తన భక్తి సూత్రాలలో ఇలా పేర్కొన్నాడు. ''సాత్వస్మిన్ పరమ ప్రేమ రూపా'' ఆ పరమేశ్వరుని యందు అతిశయించిన ప్రేమ స్వరూపమే భక్తి'' అమృత స్వరూపా చ అది ఇంకా శాశ్వతమైన అమృత స్వరూపం కూడా.

ఈ విధంగా ఇంకా అనేక మహితోక్తులు మనకు లభిస్తాయి. భగవంతునిపై గల అపారమైన ప్రేమయే, శాశ్వతమైన, అమృతమైన అసలైన భక్తిగా మహితోక్తుల ద్వారా మనకు బోధపడుతుంది.

ధూర్జటి శివభక్తి తత్పరుడై శైవ విజ్ఞానమును సంపూర్ణమగు పాండిత్యం కలవాడు. అయినను అద్వైత విద్యానిధి, మంత్ర తంత్రాది శాస్త్రములను పరిశీలించిన తత్త్వవేత్త. జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించి సంసారాన్ని రోసి, వైరాగ్యాన్ని పొందిన భక్తకవి, రక్తి నుండి విరక్తిని పొందిన జ్ఞాని.

## ఆధారగ్రంథాలు

1. తెలుగు సాహిత్య చరిత్ర – రాయల యుగం – తెలుగు అకాడమి, హైదరాబాదు, 1986.
2. శ్రీకాళహస్తీశ్వర శతకము 3. శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము 4. నవ విధ భక్తి రీతులు
5. భక్తియోగం – స్వామి వివేకానంద 6. నారద భక్తి సూత్రములు – ధర్మబోధిని ప్రచురణ.